క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: పట్టణంలోని రాజమహల్ కాలనీలో రూ.16 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. అలాగే 10, 11 వార్డుల్లో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి కూడా ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ తెంటు పార్వతి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలు చేరుకోవాలి



రుణాలు సద్వినియోగం చేసుకున్న వారిని సత్కరిస్తున్న మెప్మా పీడీ సుధాకర్, ఎల్‌డీఎం శ్రీనివాసరావు

రాజాం: మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న రుణ లక్ష్యాలను ప్రతీ మండలంలో బ్యాంకర్స్, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది చేరుకోవాలని మెప్మా పీడీ బి.సుధాకర్ సూచించారు. రాజాం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో జేఎంఎల్‌బీసీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన 34 బ్యాంకుల బ్రాంచి మేనేజర్లు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంలు, సీసీలు, సీఎఫ్‌లు, మెప్మా ఆర్‌పీలు, పశుసంవర్థక శాఖ, వ్యవసాయ శాఖ, ఫిషరీస్ సిబ్బందితో సమీక్షించారు. 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా చేసుకున్న పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ రుణాల వివరాలు, గ్రౌండింగ్ వివరాలపై ఆరా తీశారు. ఎల్‌డీఎం శ్రీనివాసరావు, వైఎస్సార్ క్రాంతి పథం రాజాం ఏసీ చిరంజీవి, ఏపీఎంలు దధి కుమార్, అప్పలనాయుడు, మంగమ్మ, చక్రపాణి, సీతారాం, టీఎంసీ రత్నం పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో స్టాక్ పరిశీలన

రాజాం : పట్టణ పరిధిలోని వస్త్రపురి కాలనీ సమీపంలో ఎంఎల్‌ఎస్(మండల లెవెల్ స్టాక్) గొడౌన్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జి.దేవి, ఇ.లక్ష్మీరెడ్డి గురువారం పరిశీలించారు. ఆకస్మికంగా గొడౌన్‌కు చేరుకుని స్టాక్‌పై ఆరా తీశారు. ఇన్‌చార్జ్ జి.అనంతరావు వద్ద వివరాలు సేకరించారు. 50 కిలోల బియ్యం బస్తాను తూకం వేయించి చూడగా అక్కడి డిజిటల్ ఖాతా సరిగ్గా చూపించగా, వేరే ఖాతా తీసుకొచ్చి చెక్ చేయగా కిలో తేడా వచ్చింది. దీంతో ఈ ఖాతాను సరి చేయాలని ఇన్‌చార్జ్‌కు ఆదేశించారు. అనంతరంగా గొడౌన్‌లో ఉన్న బియ్యం వివరాలు, సప్లై చేస్తున్న మండలాల వివరాలు తెలుసుకున్నారు. స్థానిక డీటీ సాయికామేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీవో డాక్టర్ కనకదుర్గ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా

రేగిడి : సంకిలి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆ సంఘం నూతన చైర్మన్ లావేటి వెంకటవేణుగోపాలనాయుడు అన్నారు. గురువారం సంకిలి సొసైటీలో బాధ్యతలు చేపట్టారు. పర్సన్‌లుగా అప్పాపురం మాజీ సర్పంచ్ కొమ్ము దుర్గారావు, తాటిపాడు మాజీ సర్పంచ్ పేడ్డ రామినాయుడు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సహకారంతో సొసైటీ పరిధిలోని రైతులు అందరికీ రుణాలు సకాలంలో అందించి లక్ష్యాన్ని చేరుకుంటామని అన్నారు. కార్యక్రమంలో సీఈవో బి.సత్యంనాయుడు, అసిస్టెంట్‌లు సీహెచ్ శ్రీను, డి.రాజబాబు, మాజీ చైర్మన్‌లు రాయపురెడ్డి కృష్ణారావు, కరణం శ్రీనివాసరావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభి, తదితరులు పాల్గొన్నారు.

తీరిన రహదారి కష్టాలు

రేగిడి : మండలంలోని ఉంగరాడ గ్రామంలో ఏళ్లుగా ఉన్న రహదారి సౌకర్యానికి మోక్షం కలిగింది. రూ.8 లక్షలు నిధులతో గ్రావెల్ రహదారి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు రోజా గౌరునాయుడు నిర్మించారు. గ్రామంలో ప్రధాన రహదారి నుంచి శ్మశాన వాటికకు, అమ్మవారి గుడికి ఈ రహదారుల నిర్మాణం జరిగినట్లు ఎంపీటీసీ వెల్లడించారు.

ఒకే నామినేషన్

సంతకవిటి: మండలంలోని కేఆర్‌పురం పంచాయతీకి సంబంధించి నాల్గవ వార్డు మెంబర్ ఎన్నికకు సంబంధించి గురువారంతో నామినేషన్ దాఖలు చేయడానికి గడువు ముగియడంతో ఒకే నామినేషన్ దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి సీహెచ్ భాస్కరరావు వెల్లడించారు. కాయల గౌరమ్మ(52) నామినేషన్‌ను పండు వెంకట కృష్ణారావు ప్రతిపాదించినట్లు వెల్లడించారు

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

● ఎమ్మెల్యే జోగులు

రేగిడి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకేనని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని బొడ్డవలస, చిన్నయ్యపేట గ్రామాల్లో గడప గడపకుమ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. బుక్‌లెట్‌లు అందించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ప్రతీ ఒక్కరికి అందుతున్నాయని, ప్రతీ ఇంట్లో లబ్ధిదారులు ఉన్నారని వెల్లడించారు. ఈ పథకాలన్నీ రాజకీయ నేతలు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే చేరుతున్నాయని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ప్రజలకు వివరించారు. పవన్‌కల్యాణ్ ప్యాకేజీకి ఆశపడి ప్రభుత్వాన్ని దూషిస్తున్నాడని, ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు మరింత అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం గ్రామాల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, పోలేటి కార్పొరేషన్ డైరెక్టర్ కింజరాపు సురేష్‌కుమార్, సర్పంచ్ బుడుమూరి పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రాయపురెడ్డి కృష్ణారావు, ఎంపీడీవో నాగమణి, తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



రేగిడి : బొడ్డవలసలో గడప గడపకు మన ప్రభుత్వంలో బుక్‌లెట్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

గడప గడపకూ సంక్షేమం..

బొబ్బిలి: గడప గడపకూ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని లోచర్లలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అలాగే గడచిన నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా ప్రజల బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం వల్ల దళారుల బెడద తప్పిందన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను సీఎం జగనన్న అమలు చేశారని తెలిపారు. అలాగే ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీలన్నీ నెరవేర్చాడని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ప్రజలంతా జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బొబ్బిలి, తెర్లాం మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, నర్సుపల్లి బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు లూర్దు రామారావు, లోచర్ల సర్పంచ్ జి.దాలమ్మ, పార్టీ సీనియర్ నాయకులు మక్రాపు జగన్నాథం, బి.అప్పలనాయుడు, ఎంపీడీఓ శంబంగి రామకష్ణ, తహసీల్దార్ రత్నకుమార్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెర్లాం: లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

పవన్ టీడీపీ స్క్రిప్ట్‌లో నటిస్తున్నారు..

● ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం : సినిమాలో డైరెక్టర్ సూచనలతో నటించే పవన్‌కల్యాణ్ రాజకీయ జీవితంలో టీడీపీ నేత చంద్రబాబునాయుడు రచించిన స్క్రిప్ట్ డైరెక్షన్‌లో నటిస్తున్నారని ఎమ్మెల్యే కంబాల జోగులు మండిపడ్డారు. రాజాంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మీడియా సమావేశంలో గురువారం మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు తమ పరిధిలో సేవలు అందిస్తున్న కుటుంబాల వివరాలు గ్రామ, వార్డు వలంటీర్లు తీసుకుంటే వాటిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ సభ్యత్వ నమోదు నిమిత్తం ఓటరుకు చెందిన ఆధార్ కార్డుతో సహా వివరాలు తీసుకోవడం అపరాధం కాదా అని ప్రశ్నించారు. ఈ డేటాను పవన్ వేరే దేశాలకు అమ్మేస్తున్నాడా.. అంటూ మండిపడ్డారు. ఎప్పుడు చూసినా టీడీపీని వెంటబెట్టుకుని వస్తున్న పవన్‌కల్యాణ్ చంద్రబాబునాయుడు ఇచ్చిన స్క్రిప్ట్ చదివే కంటే ఆ పార్టీలో నేరుగా చేరిపోతే మంచిదన్నారు. కనీసం ఒక్క ప్రజా సంక్షేమ కార్యక్రమంగానీ, ప్రజలు మెచ్చే పోరాటం కానీ చేయలేని పవన్‌కల్యాణ్‌ను ప్రజలు ఎలా నమ్ముతారని అన్నారు. పూర్తిగా రాజకీయ పరిపక్వత లేని పవన్‌ను చంద్రబాబు టీం చక్కగా వాడుకుంటుందని, ప్రజలను మభ్యపెట్టి అపోహలకు గురిచేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. టీడీపీతో పాటు ఆ పార్టీకి వత్తాసు పలికే పరిస్థితిల్లో ప్రజలు లేరని వెల్లడించారు.



ఎమ్మెల్యే కంబాల జోగులు

చురుగ్గా సీసీ రోడ్డు పనులు

బాడంగి: మండలంలోని భీమవరం సచివాలయ పరిధిలోని చినభీమవరం గ్రామానికి రూ. 4 లక్షలతో అప్రోచ్ సీసీ రోడ్డు వేస్తున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు బాడంగి రావాలన్నా, పొలాలకు వెళ్లాలన్నా ఇబ్బంది పడేవారు. ఎంతమంది పాలకులు మారినా రోడ్డు మాత్రం వేయలేదు. ఎట్టకేలకు గ్రామస్తుల ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు రూ. 4 లక్షల నిధులు మంజూరు చేయడంతో రోడ్డు పనులు శరవేగంగా చేపడుతున్నారు. దశాబ్దాల కల నెరవేరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చినభీమవరంలో వేస్తున్న అప్రోచ్ సీసీ రోడ్డు

సచివాలయం మార్చాలంటూ నిరాహార దీక్ష

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామస్తులు సచివాలయం మార్చాలంటూ గురువారం రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. గ్రామంలో ప్రభుత్వ భవనం ఉన్నప్పటికీ సచివాలయ ఉద్యోగులు ప్రైవేటు భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. అద్దె భవనంలో నుంచి ప్రభుత్వ భవనంలోకి సచివాలయాన్ని మార్చాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని వారంతా వాపోయారు. దీంతో చేసేదేమీ లేక రిలే నిరాహారదీక్ష చేపట్టామని తెలిపారు. నిరాహార దీక్ష చేపట్టిన వారిలో రెడ్డి శ్రీనివాసరావు, ఇనుమల సత్యనారాయణ, శాసపు శ్రీరామమూర్తి, గార సింహాద్రి, శాసపు మోహనరావు, మీసాల కూర్మనాయుడు, గోవిందరావు, శాసపు లక్షున్నాయుడు తదితరులు ఉన్నారు. వీరికి గ్రామస్తులు సంఘీబావం తెలిపారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ ఎంవీ నాగరాజు దీక్షా శిబిరం వద్దకు చేరుకుని దీక్షాపరులతో సంప్రదింపులు జరిపారు. ఈ నెల 14వ తేదీలోగా సచివాలయం పూర్తి స్థాయిలో మారుస్తామని హామీ ఇచ్చి దీక్ష విరమింపజేశారు.



దీక్ష విరమింపజేస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

రూ. 1.10 కోట్లతో భైరిసాగరం అభివృద్ధి

● పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: భైరిసాగరం అభివృద్ధితో స్థానికుల చిరకాల స్వప్నం నెరవేరనుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. రూ. 1.10 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి, సుందరీకరణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం మరో రూ.1.10 కోట్లతో సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కెర్బ్‌వాల్‌కు రూ.7లక్షలు, వాకింగ్ ట్రాక్‌కు రూ.9.62 లక్షలు, గ్రావెల్ ఫార్మేషన్‌కు రూ.4.65 లక్షలు, స్టోన్ పిచ్చింగ్‌కు రూ.15.66 లక్షలు, ఫెన్సింగ్‌కు రూ. 15.45 లక్షలు, ప్లాంటేషన్‌కు రూ.19.90 లక్షలు, విద్యుదీకరణ, జల వనరుల రక్షణ, జంగిల్ క్లియరెన్స్‌లకు రూ.2 లక్షల చొప్పున కేటాయించినట్లు తెలిపారు. పూర్తి స్థాయి పనులతో పాటు త్వరలో ఇక్కడ బోటు షికారు ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో అభివృద్ధి అంటే కేవలం కొబ్బరి కాయలు కొట్టడంతోనే సరిపెట్టేశారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో శంకుస్థాపనలతో పాటు పనులు కూడా ప్రారంభమయ్యేలా ఎమ్మెల్యే చొరవ చూపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు (విను), స్థానిక కౌన్సిలర్లు చోడిగంజి రమేష్‌నాయుడు, కోట పెదరాములు, పలువురు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ గణపతిరావు, ఈఈ దక్షిణామూర్తి

బొబ్బిలి: మున్సిపాలిటీలో జరుగుతున్న అర్బన్ హెల్త్ క్లినిక్, జగనన్న కాలనీల్లో వాటర్ సప్లై పనులు, 15వ ఆర్థిక సంఘం నిధుల పనులు, హెడ్ వాటర్ వర్క్స్, ఏఐబీ బృహత్తర తాగునీటి పథకం పనులను ప్రజారోగ్యశాఖ ఎస్ఈ పి. గణపతిరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ దక్షిణామూర్తి, డీఈ రవి, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

బాడంగి: మండలంలో ఖాళీగా ఉన్న ఆరు వలంటీర్ పోస్టులకు సంబంధించి గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న ఎనిమిది అభ్యర్థులూ ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు.ఆయనతో పాటు ఏఓ రామలింగేశ్వరరావు, టైపిస్ట వినయ్ ఉన్నారు. బొబ్బిలి:మండలంలోని పారాది, కృష్ణాపురం, సీహెచ్ బొడ్డవలస, మెట్టవలస గ్రామాల్లో ఖాళీ అయిన వలంటీర్ పోస్టుల భర్తీకి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎంపీడీఓ పోతుల రవికుమార్, ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు, ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరావు ఇంటర్వ్యూలు చేపట్టారు. అలాగే పారాది పాఠశాలను ఎంపీడీఓ పోతుల రవికుమార్ సందర్శించి, మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నిబంధనల మేరకే ఖర్చు

● జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్

బాడంగి: ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘ నిధులను నిబంధనల మేరకే ఖర్చు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎల్‌వీఎన్ శ్రీధర్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచే క్లాప్‌మిత్రలకు (పారిశుధ్య కార్మికులు) జీతాలు చెల్లించాలన్నారు. అలాగే పారిశుధ్యం, తాగునీరు, రోడ్ల నిర్మాణాలు వంటి పనులకు నిధులు ఖర్చు చేయాలని సూచించారు. వచ్చే ఏడాది ఇంటి పన్ను 5 శాతం పెంచి వసూలు చేయాలన్నారు. పంచాయతీ సర్వసభ్య సమావేశాలు సకాలంలో విధిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలకు తరలించి, ఎరువులు తయారుచేసుకుని పంచాయతీ ఆదాయం పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఓ శ్రీధర్, పక్కన ఈఓపీఆర్‌డీ

సస్యరక్షణపై అవగాహన తప్పనిసరి

తెర్లాం: ఖరీఫ్‌లో వరి సాగు చేసే రైతులు మెలకువలు, సస్యరక్షణపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని కుసుమూరు రైతుభరోసా కేంద్రంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురురవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి నాట్లు వేసేముందు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, కాంప్లెక్స్ ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువులను ఎక్కువగా వినియోగించాలని సూచించారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకున్నప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ క్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేసుకుంటే దిగుబడులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు, సర్పంచ్ తెంటు సత్యంనాయుడు, వీఏఏ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



పంటల సాగుపై సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించండి

తెర్లాం: ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని, చిరుధాన్యాలు ప్రతిరోజూ తినడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నేపల్లి సింహాద్రినాయుడు అన్నారు. గురుస్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం టి.రాము ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాద్రినాయుడు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి సారవంతమవుతుందని చెప్పారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు ప్రతి గ్రామంలో కనీసం నలుగురైదుగురు రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయించాలని సూచించారు. అలాగే రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, గంటెలు సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో వెలుగు సీసీలు, వీఓఏలు, ఎస్‌హెచ్‌జీల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ సింహాద్రినాయుడు

యువత ఆరోగ్యమే ముఖ్యం...

మెరుగైన సమాజం ఏర్పాటుకు ఆరోగ్యవంతమైన యువత అవసరమని భావించిన ప్రభుత్వం బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో చిన్నారులు నులిపురుగుల బారిన పడకుండా ఉండేందుకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేపట్టింది. డీ వార్మింగ్ డే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఉండే చిన్నారులచే గురువారం మాత్రలు మింగించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



తెర్లాం : హైస్కూల్‌లో విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలు వేయిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీఓ రాజ్యలక్ష్మి, తదితరులు



బొబ్బిలి: వేణుగోపాలస్వామి ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



రామభద్రపురం: ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో డీ వార్మింగ్ మాత్రలు వేయిస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, తదితరులు



రాజాం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండోజోల్ మాత్రలు వేస్తున్న కమిషనర్ డీటీవీ కృష్ణారావు, తదితరులు



వంగర: విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



రేగిడి : బూరాడ పీహెచ్‌సీలో మాత్రలు వేస్తున్న వైద్యాధికారి డాక్టర్ చలమయ్య



సంతకవిటి: నులిపురుగుల నివారణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్ ఎస్.జగన్మోహనరావు



రాజాం సిటీ: పొగిరి హైస్కూల్‌లో విద్యార్థినికి నులి పురుగుల మాత్ర వేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి ఆకిరి భార్గవ్

లోపాలుంటే సహించేది లేదు..

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలులో లోపాలుంటే సహించేది లేదని ఎంఈఓ జె. త్రినాథరావు అన్నారు. మండలంలోని కాలంరాజుపేట యూపీ స్కూల్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగే ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇటీవల హత్యకు గురైన పాఠశాల ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణకు నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం మెనూపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

ఉప ఎన్నికకు మూడు నామినేషన్లు

బాడంగి: మండంలోని పాల్తేరు ఆరో వార్డుకు జరుగుతున్న ఉప ఎన్నికకు సంబంధించి మూడు నామినేషన్లు దాఖలైనట్లు స్టేజ్ -1 ఎన్నికల అధికారి ఎం.రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నామినేషన్లు వేసేందుకు గురువారంతో గడువు ముగిసిందన్నారు. పూడి సత్యవతి, పాలకొండ చంద్రిక, మార్పిన లక్ష్మి నామినేషన్లు సమర్పించినట్లు చెప్పారు.

డీపీఓ పర్యటన

తెర్లాం: మండలంలోని గోపాలవలస పంచాయతీ పరిధి జగన్నాథవలసలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా గురువారం పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని ముందుగా పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే గ్రామంలోని చెరువు గట్లపై నాటిన వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. అనంతరం ఎస్సీ కాలనీలో పారిశుధ్య నిర్వహణ ఏవిధంగా ఉందో ఆరా తీవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోపాలవలసను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దిన సర్పంచ్‌ను అభినందించారు. ఆయనతో పాటు సర్పంచ్ ప్రతినిధి గొందాల వెంకటరావు, ఈఓపీఆర్‌డీ ఆర్.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి నాగభూషణ, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మాధవి జీవన్, తదితరులు ఉన్నారు.



జగన్నాథవలసలో చెరువు గట్టుపై నాటిన కొబ్బరి మొక్కలను పరిశీలిస్తున్న డీపీఓ శ్రీధర్ రాజా